# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణన కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మన్ కి బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.**

2. **భారతదేశ పవన శక్తి ఉత్పాదన సామర్థ్యం 56 గిగావాట్లను దాటిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు.**

3. **రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో అంతరాయాలపై కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

4. **సామాజిక బాధ్యత నిధులతో ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.**

==========================

దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణన కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆకాశవాణి ద్వారా మనసులోని భావాలను పంచుకునే మన్ కి బాత్ 133వ సంచిక కార్యక్రమంలో జనగణనతో పాటు పలు అంశాలపై ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగించారు. జనగణన 2027 పూర్తిగా డిజిటల్ రూపంలో జరుగుతోందని ఈసారి ప్రజలకు స్వీయ-గణన సౌకర్యం కూడా కల్పించారని తెలిపారు. డిజిటల్ విధానాల ద్వారా సమాచార భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారని అన్నారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా, భద్రంగా ఉంటుందని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

--------------------------

భారత్ విజ్ఞాన శాస్త్రాన్ని దేశ అభివృద్ధితో అనుసంధానిస్తూ ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన్ కి బాత్ కార్యక్రమంలో పౌర అణు కార్యక్రమం గురించి ప్రస్తావించారు. పారిశ్రామిక వృద్ధి, ఇంధన ఉత్పత్తి, ఆరోగ్య సంరక్షణ వంటి కీలక రంగాలకు గణనీయమైన తోడ్పాటును అందించేందుకు దేశ శాస్త్రవేత్తలు పౌర అణు కార్యక్రమాన్ని విజయవంతంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రైతుల నుంచి ఆధునిక ఆవిష్కర్తల వరకు అన్ని వర్గాలకు పౌర అణు కార్యక్రమం ఉపయోగపడుతోందని ప్రధానమంత్రి

పేర్కొంటూ,

వాయిస్ 24 సెకన్లు

---

దేశంలో పవన శక్తి రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, భారతదేశ పవన శక్తి ఉత్పాదన సామర్థ్యం 56 గిగావాట్లను దాటిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. మన్ కి బాత్ కార్యక్రమంలో భాగంగా దేశంలో పవన శక్తి రంగం పురోగతిని ప్రస్తావించారు. పవన శక్తి రంగంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా వేగంగా ఎదుగుతూ, ప్రస్తుతం నాల్గవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ విజయానికి దేశ ఇంజనీర్లు, యువత కృషి, సామూహిక సంకల్పం ప్రధాన కారణాలని ప్రధానమంత్రి తెలుపుతూ,

వాయిస్ 30 సెకన్లు

---

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో కొరత కారణంగా పలు పెట్రోల్ బంకులు మూసివేతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు. ముంబై నుంచి అమరావతికి బయలుదేరే ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఉన్నతాధికారులతో శ్రవణ మాధ్యమం విధానం ద్వారా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా, సరఫరాలో అంతరాయం కారణంగా 421 బంకులు మాత్రమే మూతపడ్డాయని అధికారులు తెలిపారు. ఇంధన సరఫరా పెరిగినా, వినియోగదారులు భయాందోళనలతో కొనుగోలు చేయడం కారణంగా బంకుల వద్ద వాహనాలు బారులు తీరి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందని వివరించారు. ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపేందుకు కలెక్టర్లు, అధికారులు కార్యాచరణ చేపట్టాలని, ప్రభుత్వ శాఖలు తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

---

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న డిజిటల్ జనగణన ప్రక్రియపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు 5కె పరుగు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్వీయ జనగణనను ప్రజలు వినియోగించుకోవాలని కోరుతూ ఎన్టీఆర్, అనంతపురం, విజయనగరం, తూర్పుగోదావరి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, నంద్యాల జిల్లాలలో నిర్వహించిన 5కె పరుగు కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ జనగణన ప్రాముఖ్యాన్ని వివరించారు.

---

ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించేందుకు స్వీయ గణన కీలకమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. స్వీయ గణన ప్రక్రియపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు పార్వతీపురంమన్యం జిల్లా సాలూరులో నిర్వహించిన అవగాహన ర్యాలీని మంత్రి ఈరోజు ప్రారంభించారు. 5 కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడుతూ,. స్వీయ గణనపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరుతూ,

వాయిస్..30.. సెకన్లు

---

సింగపూర్ లో రాష్ట్ర మంత్రుల బృందం పర్యటన కొనసాగుతోంది. ఈరోజు పర్యటనలో భాగంగా క్లిష్ట పరిస్థితుల్లో.. ఒక బృందంగా సమర్థవంతంగా స్పందించే విధానం "టేబుల్ టాప్ ఎక్సర్ సైజ్" పై సింగపూర్ ప్రభుత్వం రాష్ట్ర మంత్రులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. టేబుల్ టాప్ ఎక్సర్ సైజ్ విధానంలో భాగంగా సైబర్ సెక్యూరిటీ, డేటా లీక్, భద్రతా లోపం లేదా అత్యవసర పరిస్థితుల్లో.. లక్ష్యాలు, పాత్రల కేటాయింపు, సమస్య పరిష్కారం, నిర్ణయాలు తీసుకోవడం, లోపాలను గుర్తించడం వంటి అంశాలను మంత్రులు అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, వై.సత్య కుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

---------------------------

సామాజిక బాధ్యత నిధులతో ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని అరవింద నగర్ లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. నెల్లూరు నగర, గ్రామీణ నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ, నగర పాలక సంస్థలకు చెందిన పాఠశాలల విద్యార్థులకు ఐదు కోట్ల రూపాయలతో సైకిళ్ళను మంత్రి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 20 కోట్ల రూపాయల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులుతో 20 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో మొక్కజొన్న పంట కొనుగోలుపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో చర్చిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. త్వరలో రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోనున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 సంవత్సరంలో ధరల స్థిరీకరణ నిధి కింద 300 కోట్ల రూపాయలు కేటాయించగా.. 588 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని వివరించారు.

---------------------------

ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. మేథో హక్కులు, కాపీ రైట్లు, ట్రేడ్ మార్కులు, డిజైన్లు నిత్య జీవితంలో ఎటువంటి ప్రాముఖ్యం కలిగి ఉంటాయో తెలియచేసే ఉద్దేశ్యంతో ప్రపంచ మేథో హక్కుల సంఘం ప్రతి ఏటా ఏప్రిల్ 26వ తేదీన ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం 2000 సంవత్సరంలో ప్రారంభించింది. ఆవిష్కర్తలు, సృజనశీలురు ప్రపంచ వ్యాప్తంగా వివిధ సమాజాలకు అందించిన మేధస్సును ఈ రోజు గుర్తించడం ఆనవాయితీ.

=====================